క్లుప్తంగా

సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా కృష్ణ శేషాచార్య


బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణ శేషాచార్య

పెద్దాపురం: పెద్దాపురం కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా గోమఠం కృష్ణ శేషాచార్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ పోక్సో కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృష్ణ శేషాచార్య మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న 32 కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు.

నిప్పులు కురిపిస్తున్న భానుడు

సామర్లకోట: వేసవితాపంతో మంగళవారం ప్రజలు అల్లాడిపోయారు. సామర్లకోటలో 42 డిగ్రీలు నమోదు కావడం, వేడి గాలులు ఉక్కిరిబిక్కిరి చేయడంతో ముఖ్య కూడళ్లు నిర్మానుష్యంగా మారిపోయాయి. దుకాణదారులు సైతం ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోయారు.

శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి తరలిన భక్తులు


బస్సును ప్రారంభిస్తున్న ఈఓ నాగమల్లేశ్వరరావు


సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాల త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం నుంచి మంగళవారం శ్రీలక్ష్మీ మహాయజ్ఞాన్ని తిలకించడానికి బస్సు బయలుదేరింది. రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న యాగాన్ని తిలకించేందుకు భక్తుల కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉచిత బస్సు ఏర్పాటు చేయగా, ఆ బస్సు యాత్రను పంచారామ క్షేత్రం వద్ద ఈఓ డి నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను దేవదాయశాఖ ఏర్పాటు చేసిందని ఈఓ తెలిపారు.

సాంకేతిక సమస్యలను అధిగమించాలి


ఆర్పీలకు శిక్షణ ఇస్తున్న జయరాజ్

సామర్లకోట: మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో సాంకేతిక సమస్యలను శిక్షణతో అధిగమించాలని జిల్లా రిసోర్సు పర్సన్ ఎల్.జయరాజ్ అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో మెప్మాలోని సామర్లకోట మున్సిపాలిటీ రిసోర్సు పర్సన్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ప్రతీ మహిళా సంఘం తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా చేయాలన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత శిక్షణ ఇచ్చారు.

వ్యాధులపై అవగాహన తప్పనిసరి


కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతీ ఒక్కరూ వ్యాధులపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మానిక అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి, నాగులాపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల వద్ద సమావేశం నిర్వహించి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానిక మాట్లాడుతూ డెంగీ వ్యాధి రాకుండా జాగ్రత్తలను పాటించాలన్నారు. ఇళ్ల వద్ద మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం రైల్వే సూపరింటెండెంట్‌గా నాగబాబు

పిఠాపురం: పిఠాపురం రైల్వే సూపరింటెండెంట్‌గా పి.నాగబాబు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నాగబాబు గతంలో సామర్లకోట స్టేషన్ మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహించగా సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై పిఠాపురం బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు పిఠాపురం రైల్వే సూపరింటెండెంట్‌గా పనిచేసిన జనార్ధన్ కాకినాడ పోర్టు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

సర్కారు అండ.. విద్యార్థుల జెండా

- ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి
- సత్తా చాటుతూ నరికొత్త రికార్డులు సృష్టిస్తున్న వైనం


ప్రభుత్వ కళాశాలల ప్రతిభను చాటుతూ గొల్లప్రోలులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పిఠాపురం: పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి అంటే చాలు 1,2,3,4,5 ... అసాధారణ ఫలితాలు.. అద్భుత విజయాలు మా సొంతం అంటూ ప్రైవేటు విద్యాసంస్థలు ప్రచారంతో ఊదరగొడుతుంటాయి. కొన్నేళ్లుగా విద్యావ్యవస్థలో ఈ ధోరణి పెరిగిపోయింది. ప్రైవేటు విద్యాసంస్థలో తప్ప మరెక్కడా మంచి ర్యాంకు రాదని ప్రజల్లో నాటుకు పోయేలా ప్రైవేటు విద్యాసంస్థలు మాయచేశాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తూ అమలు చేస్తున్న పథకాలతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివి అత్యుత్తమ ఫలితాలను స్వంతం చేసుకుని ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు సవాల్ విసురుతున్నారు.

నాడు – నేడుతో అద్భుతాలు

గడచిన మూడేళ్లలో నాడు – నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులు మారిపోవడంతో పాటు ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా తర్ఫీదునిస్తుండడంతో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. రూపాయి ఖర్చు లేదు. మీకు చదవాలనే ఆసక్తి ఉంటే చాలు. అన్ని వసతులు కల్పిస్తాం. రండి.. చదువుకోండి.. మంచి ఉన్నత స్థానాలకు చేరుకోండి అంటూ ప్రభుత్వ విద్యాసంస్థలు ఆహ్వానం పలుకుతుండడంతో విద్యార్థులు క్యూ కడుతున్నారు.

ఇవిగో విజయ కేతనాలు

పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది విద్యార్థులు కృష్ణవేణి హెచ్ఈసీ 931 మార్కులు, జె.రేణుక ఐసీఏస్‌సీ 960, ఎల్ రాజీ ఐబీపీసీ 440 మార్కులకు 375 సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 277 మందికి 134 మంది 50.6 శాతం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 283 మందికి 89 మంది 33.9 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో జీఎస్ సౌజన్య సీఈటీలో 500కి 488 మార్కులు, షేక్ ఆషాబేగం సీఈటీలో 500కి 480 మార్కులు, సాధించి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులుగా నిలిచారు.

గొల్లప్రోలు ప్రభుత్వ కళాశాలల ఇంటర్ రెండో ఏడాది విద్యార్థులు మొగలి బంగారం 965, షేక్ ఆలీషాబేగం 957, నేపాల మోషే 940, కరణం రాజేశ్వరి 927, మామిడాల ఉమా నాగేశ్వరి 924 మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో సానా దేవి 441, వెన్నా మణికంఠ 437, పావని 429, సీఈసీలో మొండి జ్యోతి 441, కీర్తి గంగా మహాలక్ష్మి 423 మార్కులు సాధించి తమ సత్తా చాటారు.

ప్రభుత్వ ప్రోత్సాహం వల్లే మంచి మార్కులు



అందరూ ప్రైవేటు కళాశాలలకు వెళుతుంటే నన్నూ వెళ్లమనే వారు. చదువుకోవాలి కానీ ఎక్కడైతే ఏంటి అని స్థానిక ప్రభుత్వ కళాశాలలో జాయిన్ అయ్యా. అన్ని రకాల సౌకర్యాలతో చదువు బాగా చెబుతున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల బాగా చదువుకున్నాను. అందువల్లే మంచి మార్కులు సాధించా.

– మొగలి బంగారం, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, గొల్లప్రోలు

అడ్మిషన్లు పెరుగుతున్నాయి



గతంలో ఎంత చెప్పినా ఎవరు జాయిన్ అవ్వడానికి ఉత్సాహం చూపించేవారు కాదు. రెండేళ్ల నుంచి అడ్మిషన్లు బాగా పెరిగాయి. విద్యార్థులు మంచి మార్కులతో పాసయి పేరు తీసుకువస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న విద్యా సంస్కరణల వల్ల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు.

– కేఎస్ఎస్ రాజశేఖర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గొల్లప్రోలు

విద్యతోనే భవిష్యత్తు


గంగా ప్రభాస్‌ను శాలువా, పూలమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: విద్యపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందని, పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఉన్నత స్థితి నుంచి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన స్వామిరెడ్డి సత్యశ్రీ శివ గంగా ప్రభాస్ 10వ తరగతి పరీక్షల్లో 582 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో మంగళవారం ప్రభాస్‌ను శాలువా, పూలమాలతో ఎమ్మెల్యే సత్కరించారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో రూ.5 వేలు ప్రోత్సాహకంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అత్యధికంగా మార్కులను సాధించి సత్తా చాటారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా విద్యావ్యవస్థల్లో వినూత్న మార్పును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకురావడంతో ఇది సాధ్యమైందన్నారు. సర్పంచ్ సీలం పెద్ద అప్పారావు, ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, ఈపీసీఎస్ అధ్యక్షుడు గుండ్ర రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీకే రామాచార్యులు పాల్గొన్నారు.

అవ్వా.. పథకాలు అందుతున్నాయా..

- లబ్ధిదారులను పలకరించిన ఎమ్మెల్యే దొరబాబు
- జములపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


జములపల్లిలో వృద్ధురాలికి పథకాలు వివరించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: పెన్షన్ తీసుకోవాలంటే ఎంతో టెన్షన్ పడాల్సి వచ్చేది. ఎక్కడో ఉన్న పంచాయతీ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగి వెళ్లి లైనులో నిలబడితే ఎప్పటికో ఇచ్చేవారు. అలాంటిది ఇప్పుడు నీఇంటికే తెచ్చి ఇస్తున్నారు.. తీసుకున్నావా అవ్వా అంటూ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పింఛనుదారులను పలకరించారు. పిఠాపురం మండలం జములపల్లిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతీ ఇంటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా అంటూ పలకరించారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వం మూడేళ్లలో అందజేసిన పథకాల వివరాలను వారికి చదివి వినిపించి అవి అందరికీ అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కచ్చితంగా ఒకటో తేదీన ఇంటికి తెచ్చి పెన్షన్ ఇచ్చే పరిస్థితి దేశంలో మన రాష్ట్రంలోనే అమలవుతోందన్నారు. పథకాల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు తావు లేదని, అన్నీ ఆన్‌లైన్‌లో ఎవరి ప్రమేయం, సిఫారసులు లేకుండా అందేలా చర్యలు తీసుకున్నట్టు ఆయన ప్రజలకు వివరించారు. ఒకవేళ ఎవరికైనా అందకపోతే అక్కడికక్కడే అధికారులను పిలిచి ఎందువల్ల రాలేదన్న విషయాన్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని, అన్ని పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. దీనిని తట్టుకోలేక ప్రతిపక్షం పనిగట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తూ పస లేని విమర్శలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందని, ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి ఆరు పథకాల వరకు అందుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణను చూస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందేలా తీసుకున్న చర్యల ఫలితం కనిపిస్తోందన్నారు. ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందేలా చేసి అవినీతికి తావు లేకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దింటి రజని, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, గోకివాడ సర్పంచ్ కీర్తి హరినాథబాబు, వులవల భూషణం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, రాయుడు చిన్ని, ఓలేటి పాపిరెడ్డి, పలువురు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సహృదయ మిత్ర మండలి సేవలు అభినందనీయం

మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు


టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు

పిఠాపురం: పిఠాపురంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవలో ముందుంటున్న సహృదయ మిత్ర మండలి సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావు అన్నారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు సెల్ ఫోన్లను అవసరమైనంత మేర మాత్రమే వినియోగించాలి తప్ప వాటికి బానిసలు కాకూడదన్నారు. తమ అమూల్యమైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏరంగంలోనైనా విజయం సాధించవచ్చన్నారు. 15 రోజులుగా సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పదవ తరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించిన పి.కీర్తిప్రియ, 580 మార్కులు సాధించిన ఎస్ఎస్‌వీ కుసుమ, 577 మార్కులు సాధించిన వి.మహాలక్ష్మిలను సత్కరించిన ఆయన వారిని అభినందించారు. విశ్రాంత సోషల్ వెల్ఫేర్ డీడీ వి.చక్రధరరావు, తోట శ్రీనివాసరావు, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, కొత్తపల్లి ఎంఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికడదాం


ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సురేంద్ర

పెద్దాపురం: పట్టణంలో దోమల పెరుగుదలను అరికట్టి, రోగాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ మౌనిక, హెచ్‌వి వీరలక్ష్మి, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రత్నగిరిపై వేగంగా డార్మెట్రీ నిర్మాణం

- రూ.రెండు కోట్లతో నిర్మిస్తున్న దాత రాజామణి
- ఇప్పటికే మూడొంతుల పని పూర్తి
- ఏక కాలంలో వేయి మంది భక్తుల విశ్రాంతికి ఏర్పాట్లు


శ్లాబ్‌ల వరకు పూర్తయిన డార్మెట్రీ నిర్మాణం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ ఆలయం ఎదురుగా రూ. రెండు కోట్లు వ్యయంతో దాత పెన్నాడ రాజామణి నిర్మిస్తున్న డార్మెట్రీ (భక్తుల విశ్రాంతి భవనం) పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ఈ డార్మెట్రీ నిర్మాణం పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే మూడొంతుల పనులు పూర్తయ్యాయి.

నడక దారి భక్తులు సేద తీరేందుకు...

రత్నగిరి సత్యదేవుని దర్శనానికి మెట్లదారి వెంట వచ్చే భక్తులు సేద తీరేందుకు శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద డార్మెట్రీ నిర్మించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో రాజమహేంద్రవరానికి చెందిన దాత పెన్నాడ వేంకట రాజామణి సత్యదేవుని భక్తుల కోసం డార్మెట్రీ నిర్మించ నున్నట్లు తెలిపారు. దాంతో అప్పటి ఈఓ వి.త్రినాథరావు శ్రీవనదుర్గ ఆలయం వద్ద గల పాత భవనాన్ని కూల్చివేసి ఆ స్థలాన్ని దాతకు అప్పగించారు. గత ఏడాది ఆగస్టు 13వ తేదీన ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ ఈ డార్మెట్రీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

మూడు అంతస్తుల్లో..

మొత్తం 3,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తులలో నిర్మాణమవుతున్న ఈ భవనంలో ఏక కాలంలో వేయిమంది సేద తీరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ భవనంలో స్నానపు గదులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల భక్తులు వసతి గదుల కోసం ప్రయత్నించకుండా ఇక్కడే స్నానం చేసి స్వామివారిని దర్శనం చేసుకోవచ్చు.

శరవేగంగా..

సాధారణంగా దేవస్థానం ఏదైనా నిర్మాణం ప్రారంభమవ్వాలంటే నిర్మాణ అంచనా, దానిని కమిషనర్ ఆమోదం, ఆ పై టెండర్లు, లోయెస్ట్ టెండర్ ఆమోదం, ఆ పై కాంట్రాక్టర్‌తో నిర్మాణ ఒప్పందం, ఆ తరువాత పనులు ప్రారంభమవుతాయి. ఇదంతా జరగడానికి కనీసం నాలుగు నెలలు పడుతుంది. అటువంటిది భూమి పూజ జరిగిన వెంటనే దాత పనులు ప్రారంభించారు. మూడు నెలలకే పునాదుల వరకు పనులు పూర్తి కాగా, తొమ్మిది నెలలకే మూడు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం బ్రిక్ వర్క్ జరుగుతోంది. దీని తరువాత టైల్స్ అతికించడం, టాయిలెట్స్ నిర్మాణం, విద్యుత్ పనులు చేస్తామని ఆ పనులు పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టర్ అబ్బులు తెలిపారు.

ఆగస్టు కల్లా అప్పగిస్తాం: దాత రాజామణి

అనుకున్న దాని కన్నా పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.రెండు కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు అయినా భరించి ఆగస్టు నాటికి దీనిని పూర్తిచేసి దేవస్థానానికి అప్పగిస్తామని దాత రాజామణి తెలిపారు.

ప్రాణాలతో చెలగాటం వద్దు

- అత్యంత జాగ్రత్తగా వాహనం నడపాలి
- డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి
- ఆటో, లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు


ఆటో, లారీ డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి. చిత్రంలో సీఐ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: వాహనం నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి ఆటో, లారీ డ్రైవర్లకు సూచించారు. సర్పవరం జంక్షన్‌లో స్పందన ఫంక్షన్ హాలులో సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో 10 ఆటో యూనిట్ల నాయకులు, డ్రైవర్లు, లారీ, ట్యాంకర్ల యూనియన్ల డ్రైవర్లకు మంగళవారం సీఐ ఆకుల మురళీకృష్ణ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు పెట్టారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సమారు 3 వందల మంది డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఇటీవల తాళ్లరేవులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ నిద్రపోవడం, లైసెన్స్ లేని క్లీనర్ మద్యం తాగి బస్సు నడపడమే కారణం అన్నారు. ఆటోలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం వల్ల డ్రైవర్‌కు ప్రమాదం నుంచి తప్పించేందుకు అవకాశం లేకుండా పోయిందని, దీని వల్ల ఏడుగురు మృతి చెందగా, మిగిలిన ఏడుగురిలో ఇద్దరికి సీరియస్‌గా ఉందన్నారు. ఆటో, లారీ డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, డ్రైవర్లందరూ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు వాహనానికి బీమా చేయించాలన్నారు. ఎక్కడిపడితే అక్కడ సడన్‌గా ఆటోలను ఆపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, రికార్డులు సక్రమంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆటో, లారీ యూనియన్ల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్రీన్ చాంప్ @ పీఆర్ కాలేజ్

- హరిత వనాన్ని తలపించేలా కళాశాల ఆవరణ
- వేసవిలో రెండు డిగ్రీలు తక్కువగా నమోదు
- అత్యవసరం అయినచోటే కాంక్రీట్ రహదారులు



బాలాజీచెరువు: నగరానికి నడిమధ్యలో సుమారు 28 ఎకరాల వీస్తీర్ణం కలిగి 137 ఏళ్ల చరిత్ర కలిగిన పీఆర్ ప్రభుత్వ కళాశాల పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. 42 డిగ్రీల మండుటెండలో సైతం కళాశాల ఆవరణలో రెండు నుంచి మూడు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయంటే అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితుల దృష్ట్యా గ్రీన్ చాంపియన్‌షిప్ పురస్కారాన్ని కైవసం చేసుకుంది. మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సెల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యాశాఖ సంయుక్తంగా జిల్లాకు ఒక గ్రీన్ చాంపియన్ షిప్ అవార్డును ఎంపిక చేయడంలో భాగంగా గత ఏడాది కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థానం సాధించింది. నగరంలో అత్యధిక వీస్తీర్ణంతో పాటు పచ్చని వృక్షాలు కలిగిన కళాశాలలు జేఎన్‌టీయూ, ప్రభుత్వ ఐటీఐ, ఏపీటీ, జీపీటీ కళాశాలలు ఉండగా పీఆర్ కళాశాలను గుర్తించారు.

శక్తి వనరుల వినియోగం..

నీటి యాజమాన్య నిర్వహణ, వ్యర్థాల యాజమాన్యం, శక్తి వనరుల వినియోగంలో సరైన విధానాన్ని ఇక్కడి యాజమాన్యం అవలంబిస్తోంది. ఆరోగ్యం –పరిశుభ్రత, పచ్చదనంతో పాటు రెండు ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, వినియోగం లేదా వర్షపు నీరు నిల్వ లేకుండా ఇంకిపోయేందుకు మార్గాలు, సేకరించిన వ్యర్థాలు, కంపోస్ట్ ఎరువు తయారీ విధానం, తడి, పొడి చెత్త సేకరణతో పాటు కళాశాల అవరణలో దాదాపు 500 మొక్కలకు పైగా పెంచి పచ్చదనంతో ఉండటం వల్ల ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. ముఖ్యమైన ప్రాంతాల్లో తప్ప కాంక్రీట్ రహదారులు లేకుండా వాకింగ్ ట్రాక్‌తో సహా మట్టిరోడ్లు వేసి మొక్కల పెంపుదలకు కృషిచేయడం వల్ల కళాశాల క్యాంపస్ పచ్చదనాన్ని సంతరించుకుంటోంది.

వేసవిలోనూ చల్లదనం



కళాశాలలో డిగ్రీ, పీజీ స్థాయిలో ఉన్న 2 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, నాలుగు ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో కళాశాలలో పచ్చని వాతావరణం కల్పించడం సాధ్యమైయింది. కళాశాలను నగరానికి గ్రీన్ అంబాసిడర్‌గా తయారు చేసి ఆదర్శంగా నిలపడానికి అందరి సహకారంతో కృషి చేస్తాం. నగర వాతావరణం కంటే కళాశాల అవరణంలో రెండు శాతం ఉష్ణోగ్రత మార్పు రావడం సంతోషం.

– డాక్టర్ పసుపులేటి హరిరామ ప్రసాద్, హిందీ విభాగాధిపతి

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బీవీ రమణ

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించి భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని ఆర్డీవో బీవీ రమణ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్వే రాళ్ల పాతే కార్యక్రమం త్వరితగతిన చేపట్టాలని, మీ సేవ పెండింగ్ దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్య తీసుకోవాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ చేపట్టాలని, అదే విధంగా ఓటీఎస్ దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రగతి చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని మండల తహసీల్దార్లు, పరిపాలనాధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.